క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ

చింతకాని: మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కాంపౌండ్ వాల్ మూసివేయాలి

మధిర: మాటూరుపేట ప్రభుత్వ పశు వైద్య ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణలో అక్రమంగా తొలగించిన కాంపౌండ్ వాల్‌ను వెంటనే మూసివేయాలని జిల్లా పశువైద్య సహాయ సంచాలకుడు బి.వేణుమనోహర్‌రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ వైద్యశాల కాంపౌండ్ స్థలాన్ని ఆక్రమించుకొని రహదారిగా ఉపయోగిస్తున్న సమాచారం తెలుసుకున్న జేడీ రెండు రోజుల క్రితం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆక్రమించుకున్న విషయాన్ని నిర్ధారించి అతనిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

బోనకల్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సీఎంఓ రాజశేఖర్ అన్నారు. మండలంలోని చొప్పకట్లపాలెం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించి అభినందించారు. తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రామపెద్దలు ఏడునూతల రామకోటేశ్వరరావు దంపతులు తరగతిలో ప్రతిభ గల విద్యార్థులకు నగదురూపంలో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారావు, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ కవిత, ప్రధానోపాధ్యాయులు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ అమలు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

కల్లూరు: ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ బిల్లులో ప్రతి నెలా సబ్సిడీని అమలు చేయాలని టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ కొండూరు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కల్లూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెల 100 యూనిట్లలోపులో విద్యుత్‌ను వినియోగించే సబ్సిడీని ప్రకటనలకు మాత్రమే పరిమితం చేయకుండా ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. జీరోబిల్స్ వచ్చేలా చూడాలని విద్యుత్ మండలి చైర్మన్‌ని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపాలస్వామి, ఎస్సీ సెల్ మండల నాయకులు లింగపోగు కృష్ణ, కాంతారావు, అనీల్, తేళ్లూరి కృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఏన్కూరు: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట బీజేపీ అధ్వర్యంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతు శనివారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు నల్లమోతుల రమేష్ మాట్లాడారు. ఏసీడీ విద్యుత్ చార్జీలు తగ్గించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రెంటపల్లి నారాయణ, మోరబోయిన కృష్ణ, తోట అప్పారావు, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

కొణిజర్ల: రజక వృత్తిదారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్తెనపల్లి శ్రీను, అన్నారపు వెంకటేశ్వర్లు తనికెళ్లలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం పోరాట ఫలితంగా రజకులకు ఉచిత కరెంట్ సదుపాయం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ముత్తయ్య, వెంకన్న, వెంకటేశ్వర్లు, సైదులు, అనంతరాములు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోక్షిత్‌కు అభినందనలు

మధిర: తెలంగాణ రాష్ట్ర స్థాయిలో హైదరాబాదులో సోషల్ ఫోరం వారు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ పోటీలో మధిర మండలం దెందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తీర్థాల మోక్షిత్ ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా మోక్షిత్‌ను శనివారం ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

వ్యాసరచన పోటీల్లో.. విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: డాక్టర్ వేణుగోపాలరెడ్డి మధుమేహ విద్య అవగాహన దాతృత్వ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సత్తుపల్లి శ్రీచైతన్య టెక్నో కరికులం పాఠశాల విద్యార్థులు ప్రతి చూపారు. వీరిని ప్రిన్సిపాల్ ఎస్కే ఫరీద్ ప్రశంసాపత్రాలు, మెమొంటోలతో అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అజిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'సర్కారు'లో సాధారణ ప్రసవం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన కాన్పులు
- ప్రైవేట్‌లో సిజేరియన్లు ఎక్కువ
- ఆధునిక మిడ్ వైఫరీ సేవలు అమలు



గర్భిణులతో వ్యాయామం చేపిస్తున్న మిడ్ వైఫరీ నర్సులు



సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిలోని ప్రసూతి వార్డు

సత్తుపల్లిటౌన్: సర్కార్ ఆస్పత్రి అంటే ఒకప్పుడు పేదవారు తప్ప మిగతావారు వచ్చేవారు కాదు.. ఎక కాన్పులంటే కొంచెం ఆర్థికంగా బాగున్నవారైనా సరే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లేవారు. ఇప్పుడు కేసీఆర్ కిట్ పథకం, 102 సేవలు, గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ.. ఇంకొంచెం ముందుకెళ్లి విదేశాల్లో అమలౌతున్న ప్రసవాలపై ప్రత్యేక శిక్షణ పొందిన మిడ్ వైఫరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏరియా ఆస్పత్రిలో కాన్పులు పెంచడంతో పాటు సాధారణ ప్రసవాలే లక్ష్యంగా ఖమ్మం ఎంసీహెచ్‌లో ఆరుగురు, సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిలో ముగ్గురు మిడ్ వైఫరీ సేవలు అందిస్తున్నారు. సర్కార్ దవాఖానాలో ప్రసవాలను ప్రోత్సహించేందుకు ఆస్పత్రిల్లో ఆధునీక వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటి వరకు జిల్లా కేంద్రాల్లోని ప్రధాన ఆస్పత్రులకే పరిమితమైన మిడ్ వైఫరీలను ఏరియా ఆస్పత్రికి కేటాయించి గర్భిణుల సుఖ ప్రసవాలపై దృష్టి పెట్టింది.

ప్రభుత్వం మాతాశిశు సేవలపై తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు, వైద్య సిబ్బంది కృషితో సత్తుపల్లి ఏరియా ఆస్పతిలో ప్రసవాలు గణనీయంగా పెరిగాయి. ఆరు నెలల క్రితం వరకు నెలలో 50లోపు మాత్రమే కాన్పులు జరిగితే.. ప్రస్తుతం 60 నుంచి 70 వరకు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలుఉన్నాయని, పేద, మధ్యతరగతి ప్రజలకు అవగాహన కల్పించటంతో ప్రభుత్వాస్పత్రులకు ఆదరణ పెరుగుతోంది.

కాన్పులపై భరోసా..

మాతాశిశు మరణాలను నియంత్రించాలనే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం అమలు 'మిడ్ వైఫరీ'సేవలను అందిస్తుంది. దీంతో సత్తుపల్లిలో కూడా ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వం సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిలోని సీమాంక్ సెంటర్‌కు కె.మమత, డి.మనెమ్మ, ఫర్వీన్ మిడ్‌వైఫ్‌లను నియమించింది. ఆస్పత్రిలోని వైద్యులు, స్టాఫ్‌నర్సుల సహకారంతో సేవలందిస్తూ సాధారణ కాన్పులపై గర్భిణులకు అవగాహన కల్పిస్తారు.

బర్త్ కంపానియన్ అమలుతో..

గర్భిణికి పురిటి నొప్పుల సమయంలో మానసిక, శారీరక ఒత్తిడికి గురికాకుండా.. సుఖ ప్రసవం కోసం కాన్పుల గదిలోకి గర్భిణికి ఇష్టమైన వారిని పిలిపించే 'బర్త్‌కంపానియన్'విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ పద్ధతి వల్ల ఆక్సిటోసిన్ త్వరగా విడుదలై పురిటినొప్పులు ఎక్కువగా వచ్చి త్వరగా సుఖ ప్రసవం అవుతుందని వైద్యులు వివరించారు. ఈ పద్ధతులు సత్ఫలితాలనిస్తుండటంతో ఆస్పత్రుల్లో 'బర్త్ కంపానియన్'విధానాన్ని అమలు చేస్తుంది. మిడ్ వైఫరీ సిబ్బంది ఇస్తున్న ప్రత్యేక వ్యాయామాలు, ఆసనాలు, అవగాహన కార్యక్రమాలు గర్భిణుల్లో మనోధైర్యాన్ని నింపుతోంది.

సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు ఇలా..

నెల	కాన్పులు
ఆగస్టు	59
సెప్టెంబర్	74
అక్టోబర్	77
నవంబర్	60
డిసెంబర్	76
జనవరి	20 వరకు



భయం పోయింది..



మిడ్‌వైవ్స్ సిస్టర్స్ చెప్పిన పద్ధతులు పాటించటం వల్ల భయం పోయి చాలా తేలిగ్గా సాధారణ కాన్పు అయింది. మూడో నెల నుంచే ప్రభుత్వాస్పత్రిలో చెకప్‌కు వస్తున్నాను. వ్యాయామాలు చేయించారు. నడుము తిప్పటం.. నడవటం.. వ్యాయామాలు చేయటంతో సాధారణ కాన్పు అయింది. నార్మల్ డెలివరీ పద్ధతులపై అవగాహన కల్పించారు. చాలా ఆనందంగా ఉంది.

– కె.నస్రీన్, బాలింత, కిష్టారం, సత్తుపల్లి

సాధారణ కాన్పులే లక్ష్యం..



అస్పత్రిలో ఇప్పటి వరకు మేము సాధారణ కాన్పులు 43 చేశాం. మొదటి కాన్పు సాధారణ ప్రసవం కోసం గర్భిణులకు వ్యాయామాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. డెలివరీపై అపోహలు తొలగించి ప్రశాంత వాతావరణంలో కాన్పు చేసేలా అవగాహన కల్పిస్తున్నాం. డెలివరీ అయ్యాక ముర్రుపాలు పట్టించటంతో తల్లికి బిడ్డకి మధ్య అనుబంధం పెరుగుతుంది.

– ఫర్వీన్, మిడ్ వైఫరీ నర్సు, సత్తుపల్లి

24 గంటలూ అందుబాటులోనే..



సాధారణ కాన్పులు నిర్వహించేందుకు 24 గంటలు మిడ్ వైఫరీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో నెలకు 250 మంది గర్భిణుల ఓపీ ఉంటే.. ప్రస్తుతం 470కి పెరిగింది. మిడ్‌వైఫరీల సేవలను సద్వినియోగం చేసుకొని తొలికాన్పు సాధారణ కాన్పు అయ్యేలా గర్భిణులు సహకరించాలి.

– డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, సత్తుపల్లి

గిరిజన హక్కుల సాధనకు ఐక్యం కావాలి



గిరిజన సంఘం సభ్యత్వాలు అందజేస్తున్న ధర్మానాయక్

కొణిజర్ల: గిరిజన హక్కుల సాధనకు అందరూ ఐక్యంగా పోరాడాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ ధర్మానాయక్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో శనివారం జరిగిన గిరిజన సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం రాజ్యాంగంలో కల్పించిన హక్కులను కాలరాస్తూ పోడు భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. గిరిజనుల అభివృద్ధికి అన్ని జిల్లా కేంద్రాలలో ఐటీడీఏ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పిన ఆయన నేటికీ అమలు చేయలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఖమ్మం ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగే సంఘం జిల్లా, రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గిరిజన సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష , కార్యదర్శులుగా బాణోత్ రమేష్, బి.రాంచంద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, తేజావత్ కృష్ణకాంత్, బాణోత్ హరిచంద్, ధరావత్ సంధ్యానాయక్, నరసింహారావు సాయి, ప్రవీణ్, శ్రీను, కృష్ణ పవన్, శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల విజేత గోపినాథ్‌కు సన్మానం



గోపినాథ్‌ను సత్కరిస్తున్న జెడ్పీటీసీ కవిత, సర్పంచ్ అప్పారావు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి చెన్నంశెట్టి గోపినథ్‌ను శనివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, జెడ్పీటీసీ కవితలు శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమిళనాడు రాష్ట్రం తంజావూరు శాస్త్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతూ ఇటీవల న్యూ ఢిల్లీలోని పార్లమెంట్‌లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా చెన్నంశెట్టి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సమక్షంలో సామాజిక సంస్కర్త మదన్‌మోహన్ మాలవీయ జీవిత విశేషాలను ఆంగ్లంలో వివరిస్తూ చేసిన ప్రసంగం బాగా ఆకట్టుకుందన్నారు. లోక్‌సభ స్పీకర్ నుంచి అభినందన పొందడం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శేఖర్, ఉపాధ్యాయులు శ్రీను, నాగరాజు, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీహరి, జమలయ్య, జీవీఎస్ఎన్‌రెడ్డి, చిన్ని, తదితరులున్నారు.

వయో వృద్ధుల సంక్షేమానికి కృషి



వృద్ధురాలికి దుప్పటి అందజేస్తున్న ప్రతినిధులు

ముదిగొండ: వయో వృద్ధుల సంక్షేమానికి వయో వృద్ధుల సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు వెలిగేటి చంద్రమోహన్ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో ఫంక్షన్ హాల్ నందు శనివారం ముదిగొండ వయో వృద్ధుల ఆత్మీయ సమ్మేళన సదస్సు రాయల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. న్యూలక్ష్మీపురం సమీపంలో వయో వృద్ధుల అమ్మ – నాన్న ఆశ్రమం ఏర్పాటుకు స్థల సేకరణ, బిల్డింగ్ నిర్మాణం కోరుతూ సమావేశంలో తీర్మానించారు. హెల్ప్‌ఏజ్ ఇండియా అధికారి శ్యామ్‌కుమార్ ఈ వృద్ధులకు ఉన్న చట్టపరమైన హక్కులను వివరించారు. సమ్మేళనానికి హాజరైన 600మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి వెంకట్రామయ్య, బత్తుల ఆదినారాయణ, వల్లూరి భద్రారెడ్డి, వట్టికూటి వెంకటేశ్వర్లు, జనార్ధన్, నర్సయ్య లు పాల్గొన్నారు.

మండలస్థాయి కబడ్డీ పోటీలు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జెడ్పీ పాఠశాలల మండలస్థాయి అండర్ – 17 విభాగంలో కబడ్డీ పోటీలను జెడ్పీటీసీ శీలం కవిత, సర్పంచ్ మొగిలి అప్పారావు, ఎంపీటీసీ షేక్ మస్తాన్‌వలీలు ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 15 పాఠశాలలకు చెందిన 280 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బాలికల్లో ఎర్రుపాలెం, రామన్నపాలెం, బనిగండ్లపాడు జెడ్పీ పాఠశాలల టీమ్ విద్యార్థులు సాధించగా.. బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను జెడ్పీఎస్ భీమవరం, శ్రీభాస్కర మెమోరియల్ ఉన్నత పాఠశాల, సెంట్‌విన్సెంట్‌పాఠశాల, ఎర్రుపాలెం టీమ్‌లు గెలుచుకున్నాయి. వీరికి ఈ నెల 23న బాపట్ల ఎంపీ నందిగం సురేష్ చేతుల మీదుగా బహుమతులు అందిస్తారు. క్రీడలను డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు, పీఎస్ పాఠశాల హెచ్ఎం దండెం సత్యనారయణరెడ్డి, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శేఖర్, పలువురు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

వైరా రూరల్: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ టీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ బూత్ కోఆర్డినేటర్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని దాచాపురంలో శనివారం వైఎస్సార్‌టీపీ మండలాధ్యక్షుడు పీవీఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రేమల్లె రాముతో పాటు నాయకులు శ్రీనివాసరావు, యూసఫ్, షేక్ అన్సర్, జాన్ పాషా, సాయి, వాసు, తరుణ్, నితిన్, అభి పాల్గొన్నారు.

నియామకం..

మధిర: మధిర మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బాణావత్ వెంకటరమణ నాయక్‌ను నియమిస్తూ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ శనివారం ఆ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మధిర పట్టణంలోని బంజారా కాలనీకి చెందిన రమణ నాయక్‌ను పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందన్నారు.

మాలమహానాడు జాతీయ కార్యదర్శిగా కాంతయ్య..

పెనుబల్లి: మండలంలోని వియంబంజర్ గ్రామానికి చెందిన మాలమహానాడు రాష్ట్ర నాయకుడు మేకతొట్టి కాంతయ్యను ఆ సంఘం జాతీయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనను వియంబంజర్‌లో ఘనంగా సన్మానించారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురంలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలురకు ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ వారు అందజేసిన స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రిని శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు బి.కృష్ణారావు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మురళీధరరావు, సక్రామ్, తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

బోనకల్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బాలికలకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ వీరభద్రమ్మ మాట్లాడారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు గల బాలికలకు బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాలన్నారు. అదే విధంగా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098,112,181 గురించి బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలవాహిని, మిషన్ శక్తి కోఆర్డినేటర్లు పి.ప్రమీల, నస్రీన్, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు శిరీష, నాగమణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలని పీఓకు వినతి



జేవీఆర్ ఓసీ పీఓ ఎస్.వెంకటాచారికి వినతిపత్రం అందజేస్తున్న కిష్టారం గ్రామస్తులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం గ్రామంలోని అంబేడ్కర్‌నగర్‌కు అతి సమీపంలో ఉన్న సింగరేణి ట్రెన్ బొగ్గులోడింగ్ పాయింట్(సైలో బంకర్) బొగ్గు లోడింగ్ సమయంలో గతవారం రోజులుగా అధిక మొత్తంలో దుమ్ము లేచి కాలనీపై పడటంతో గ్రామస్తులు శనివారం జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్.వెంకటాచారిని కలిశారు. తమ కాలనీపై బొగ్గు దూమారం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని, చిన్న పిల్లలతో జీవనం సాగిస్తున్నా తమకు ఇబ్బందికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన పీఓ వెంకటాచారి తక్షణమే చర్యలు చేపట్టి దుమ్మును నియంత్రించేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు రావి నాగేశ్వరరావు, పానెం ఈశ్వర్, కొండ ప్రభుదాసు, పాలకుర్తి నాగేశ్వరరావు, పాలకుర్తి లక్ష్మణ్‌కుమార్, వేము సందీప్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

ఎర్రుపాలెం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు కోరారు. శనివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మికుల సంఘం సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ శక్తులకు సంపద దోచిపెడుతున్నాయని అన్నారు. మతోన్మాద శక్తులకు అంటకాగుతున్న పాలకుల తీరును, వారి విధానాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, నాయకులు కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వెంకట్రామయ్య, సుబ్బారెడ్డి, జోగయ్య, బసవయ్య, రామకృష్ణ తదితరులున్నారు.

జిల్లాకు ఏపీ సీపీఎం కార్యదర్శి

ఖమ్మంమయూరిసెంటర్/కొణిజర్ల: సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఖమ్మం వచ్చారు. ఈసందర్భంగా సుందరయ్య భవన్‌లో ఆయనకు పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వామపక్ష ఉద్యమాలకు కేంద్రంగా నిలుస్తూ, , అనేక ఉద్యమాలు నడిపిన చరిత్ర ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రం, మాదినేని రమేష్, నందిపాటి మనోహర్, ఆర్.ప్రకాష్, చింతల రమేష్, కె.అమరావతి, శీలం నర్సింహారావు, కె.గోపి, బివికె మేనేజర్ వై.శ్రీనివాసరావు, కళ్యాణం నాగేశ్వరరావు, గణపతి పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసరావు కొణిజర్ల మండలం చిన్నగోపతిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. నాయకులు ఎం.ధర్మానాయక్, భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య, చెరుకుమల్లి కుటుంబరావు, బోయినపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేయాలి

కల్లూరు: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి నెల రోజులు కావస్తున్నా నేటికి రైతుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేయలేదని, తక్షణమే నగదు జమ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. రైతులు బ్యాంకర్ల దగ్గరికి వెళితే ఆధార్ లింక్ కావడం లేదని, అందుకు ఓటీపీలు రావడం లేదని, మీ సేవా కేంద్రాల్లో ఆధార్ లింక్ చేసుకోవాలని చెబుతుండడంతో రైతులు మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో పెట్టుబడుల కోసం బయట నుంచి వడ్డీకి తెచ్చిన డబ్బులకు వడ్డీలు కడుతూ మళ్లీ ఇప్పుడు వేసే పంటకు అప్పుల కోసం తిరగాల్సి వస్తుందని వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించి రైతులకు సకాలంలో నగదు జమ చేయాలని కోరారు.

మల్లవరంలో ఎమ్మెల్యే పర్యటన

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలో శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. దళిత కాలనీలో మేడి అప్పారావు కుమారుడు సిద్దార్థ మౌర్య అన్న ప్రాసన వేడుకకు హాజరై ఆశీర్వదించారు. అనంతరం దివ్యాంగుడైన అద్దంకి నరసింహారావుకు సిద్ధార్థ పేరుతో ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండలాధ్యక్షుడు వెంకట్‌లాల్, మేడి సీతారాములు, వార్డు సభ్యులు వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేటి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

వివాహిత అదృశ్యం

చింతకాని: మండలపరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ వివాహిత రెండు రోజుల క్రితం అదృశ్యమైనట్లు పోలీస్‌స్టేషన్‌లో శనివారం పిర్యాదు అందింది.ఆమె మామ ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్ఐ వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం

పెనుబల్లి : సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని వియంబంజర్ గ్రామానికి చెందిన శంకర్ నాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు నాళ్ల జయరాం తెలిపారు. వెల్డింగ్ వర్కు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న శంకర్ నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారి కుటుంబానికి సప్తపది లయన్స్‌క్లబ్ సభ్యుడు శంకర్ నాయక్ రూ.5 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్లు జనార్ధన్, అబ్దుల్ సలాం, వైస్ ప్రెసిడెంట్ ఆనంద్, సుబ్బారావు, రామారావు, నాగేశ్వరరావు, మాధవరెడ్డి, మంగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

కారేపల్లి: మండలంలో మల్లన్నగూడెంలో వృద్ధులకు రగ్గులను అందించారు. చేతన ఫౌండేషన్ ఖమ్మం వారి సహకారంతో 50మంది ఆదివాసీ పేద వృద్ధులకు రగ్గులను ఎస్సై పి.రామారావు శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ మోహన్, ఉప సర్పంచ్ మల్లేశ్వరీ, నవీన్, రషీద్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం వితరణ

ఏన్కూరు: మండలంలోని భగవాన్ నాయక్ తండాకు చెందిన లాలు అనారోగ్యంతో మృతి చెందారు. అతని కుటుంబానికి శనివారం బీజేపీ జిల్లా నాయకుడు నాయక్ క్వింటా బియ్యం వితరణగా అందించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, రమేష్, శశికిరన్, నారాయణ, బాలు పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్లు అందజేత

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామపంచాయతీకి శనివారం గోవిందాపురం(ఏ) గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ భాగం రాకేష్ రూ.30 వేలు విలువ చేసే 15 ఎల్ఈడీ లైట్లను సర్పంచ్ తిరుపతిరావుకు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బరకయ్య, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాశన



అన్నప్రాశన చేస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్ రెడ్డి

మధిర: తొర్లపాడు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పిల్లలకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుడుముల విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని పిల్లలకు అన్నప్రాశన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు ప్రతిరోజూ సరైన పోషకాహారం అందించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిరీష రామిరెడ్డి, వైద్య సిబ్బంది కొండయ్య, నాగమణి, అంగన్వాడీ టీచర్ నాగేంద్ర, నాగలక్ష్మి, ఆశ కార్యకర్త విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.